క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓలు

చీమకుర్తి: స్థానిక మండల పరిషత్ ఉర్దూ యూపీ స్కూల్లోని విద్యార్థులకు ఎంఈఓ–1, 2 డీవీఎల్ నరసింహారావు, కే శివాజీ చేతుల మీదుగా సోమవారం నోట్ పుస్తకాలు అందించారు. అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆర్థిక సహకారంతో నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా మాధవరావును ఎంఈఓలు అభినందించారు. హెచ్‌ఎం వద్ది మోహన్‌రావు, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర పునర్నిర్మాణంలో ఉన్న భువనేశ్వరి సహిత పశుపతేశ్వర శివాలయానికి సోమవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఒంగోలుకు చెందిన నవులూరు సుధాకర్‌రావు జ్ఞాపకార్థం అతని సతీమణి కమలమ్మ, వారి కుటుంబ సభ్యులు కలిసి ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్యకు ఆ మొత్తాన్ని అందించారు. దాతలను శేషయ్య అభినందించి సన్మానించారు.

జీఓ నంబర్–5 రద్దు చేయాలి


ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వార్డు సచివాలయాల కార్యదర్శులు

- సొంత మండలాల్లో బదిలీకి అవకాశమివ్వాలి
- ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు వార్డు సచివాలయాల కార్యదర్శుల ధర్నా

ఒంగోలు సబర్బన్: వార్డు, గ్రామ సచివాలయాల కార్యదర్శులంతా తమకు సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం వార్డు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ సచివాలయ ఉద్యోగులందరూ మూకుమ్మడిగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకుడు రవిరెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్–5 విడుదల చేసిందన్నారు. ఆ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సొంత మండలాల్లోనే బదిలీలకు అవకాశం కల్పించటంతో పాటు పదోన్నతులు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ కూడా ఇవ్వాలన్నారు. కార్యదర్శుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల నాయకులు ప్రభాకర్, బాషా, అంజి, నాగార్జునరెడ్డి, విష్ణు, భారీగా సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు ధర్నా వద్దకు చేరుకుని సచివాలయాల కార్యదర్శులకు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. సచివాలయాల కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

- తల్లికి వందనం, సంక్షేమ పథకాలూ అమలు చేయాలి
- టీడీపీ కార్యకర్తలను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని చూడటాన్ని సహించేది లేదు
- నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేసిన ఆప్కాస్ పారిశుద్ధ్య కార్మికులు


ఒంగోలు నగర పాలక సంస్థ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నగర కమిటీ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు సోమవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించిన నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి టీ మహేష్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రం చేస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు గత 17 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, గత ఎనిమిది సంవత్సరాల నుంచి 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఔట్‌సోర్సింగ్ ద్వారా కొంతమంది కార్మికులను తీసుకొని ఇప్పటివరకు గత పది సంవత్సరాల నుండి జీతాలు పెంచకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలతో ఒంగోలు నగరపాలక సంస్థలో పని చేస్తుంటే సుమారు 50 మందిని ఆప్కాస్‌లోకి తీసుకోకుండా ఏజెన్సీ ద్వారానే కొనసాగిస్తున్నారు. ఆప్కాస్‌లోకి తీసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యేని, ఉన్నతాధికారులకు విన్నవించినా నేటికీ తీసుకోకుండా పనిచేయించుకుంటున్నారని గుర్తు చేశారు. టీడీపీ కార్యకర్తలను ఆప్కాస్‌లో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కార్మికుల కడుపు కొట్టి వాళ్ల కార్యకర్తలను ఆప్కాస్‌లోకి తీసుకుంటే సహించేది లేదన్నారు. తక్షణమే సీనియార్టీ ప్రకారం కోవిడ్ పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయకుంటే కార్మికుల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీహరికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి తెల్ల విజయమ్మ, ఆర్ శ్రీనివాసరావు, బీ బాబు. కే యాకోబు, సంతోషమ్మ, కే పద్మ విజయ్, కే వంశీ. కే కృపాకర్ రావు, మస్తాన్, చిరంజీవి, అనిత, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిన మద్దిపాడు నాయకులు


యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్న మద్దిపాడు నాయకులు

మద్దిపాడు: విద్యార్థుల ఉన్నత చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి సత్వరమే చెల్లించాలంటూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి మద్దిపాడు మండలం నుంచి పార్టీ శ్రేణులు, విద్యార్థులు భారీగా తరలివెళ్లారు. కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, బొమ్మల రామాంజనేయులు, అంబటి నరేంద్ర, కంకణాల సురేష్, గద్దె జాలయ్య, నాగులుప్పలపాడు నాయకులు పి.చెన్నకేశవులు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ తదితరులు విద్యార్థులకు మద్దతుగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన ఎండోమెంట్ భూముల కౌలు వేలం


ఎండోమెంట్ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: స్థానిక చెన్నకేశవస్వామి, త్రిపురాంతకస్వామి ఆలయాల్లో సోమవారం ఎండోమెంట్ భూముల కౌలు వేలం పాట నిర్వహించగా, రైతులు పోటాపోటీగా పాల్గొని గతంలో కంటే అధిక ధరలకు భూములు పాడుకున్నారు. గతంలో 12 లక్షల 65 వేల రూపాయల కౌలు వేలం లభించగా, ప్రస్తుతం 14 లక్షల 85 వేల రూపాయల ధరకు రైతులు పాడుకున్నారు. మూడు సంవత్సరాలకు గానూ కౌలు వేలం పాట నిర్వహించారు. ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.నారాయణరెడ్డి పర్యవేక్షించారు. చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి వీర్లవారికుంట, బొడ్డువారిపాలెం గ్రామాల పరిధిలోని సుమారు 8 ఎకరాలకు కౌలు వేలం పాట నిర్వహించగా, 2 లక్షల 77 వేల రూపాయలకు రైతులు పాడుకున్నారు. సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి మైనంపాడు, బొడ్డువారిపాలెం, చంద్రపాలెం, గుడిపాడు, గురువారెడ్డిపాలెం గ్రామాల పరిధిలో 30 ఎకరాల 74 సెంట్ల భూములకు 5 లక్షల 94 వేల రూపాయలకు రైతులు పాడుకున్నారు. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి దేవస్థానానికి సంబంధించి బొడ్డువారిపాలెం, గురువారెడ్డిపాలెం, చంద్రపాలెం గుడిపాడు, సంతనూతలపాడు, గ్రామాల పరిధిలో గల 66 ఎకరాలకు 6 లక్షల 14 వేల రూపాయల కౌలు వేలం లభించింది. ఈ కౌలు వేలం పాటలను చెన్నకేశవ, త్రిపురాంతకస్వామి ఆలయాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో కరువాది గ్రూప్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాసబాబు, ఎండోమెంట్ శాఖ ఉద్యోగులు పి.రవీంద్రబాబు, పి.మురళీకృష్ణ, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైనట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాల్లో ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నారు. దాంట్లో భాగంగా పెడగాగి స్ట్రాటజీస్ ఫర్ 21 సెంచరీ అనే అంశంపై అధ్యాపకులకు అవగాహన కల్పించనున్నారు. ఎన్.ఐ.టి.టి.ఆర్‌కు చెందిన ప్రొఫెసర్ కె.ఎస్.గిరిధరన్, డాక్టర్ ఎం.అనిల్ కుమార్ రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మారుతున్న ట్రెండ్స్, విధానాన్ని బట్టి టీచింగ్‌లో రావాల్సిన మార్పులు, విధానాలను ఈ ఐదు రోజుల కార్యక్రమంలో వివరించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్ పర్యవేక్షిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


విద్యార్థులు, యువకులను వెనక్కి పంపిస్తున్న పోలీసులు


ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న యువత


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు


ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

కదంతొక్కిన యువత

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు కదంతొక్కారు. అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించి అడ్డుకున్నప్పటికీ పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులు, నిరుద్యోగుల పాలిట కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, ఒంగోలు

శివయ్యకు మాస శివరాత్రి అభిషేకాలు

- నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


నెహ్రూకాలనీలో ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

ఒంగోలు మెట్రో: జ్యేష్ఠమాసం సోమవారం శివునికి ప్రీతికరమైన మాస శివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు, ప్రదోషకాలంలో నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలు లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజ సిద్ధేశ్వర మరకత శివలింగానికి, కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం శివాలయం గంగా పార్వతీ రాజరాజేశ్వర దేవస్థానంలో, అంజయ్య రోడ్డులోని ఏకేవీకే కాలేజీ దగ్గర శివసాయి పంచముఖ శివాలయంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వేశ్వరుని దేవస్థానంలో, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో, మంగమూరుడొంక గాంధీనగర్లోని సీతారామలింగేశ్వర ఆలయంలో, నగరంలోని ప్రముఖ శివాలయాలలో ఆలయ అర్చకులు ఉదయం పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, తదితర పూజాక్రతువులు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరస్వామికి అభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు


మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: ఏక్ దేశ్ మే దో విధాన్ – ఏక్ దేశ్ మే దో నిశాన్ – ఏక్ దేశ్ మే దో ప్రధాన్ నహీ చలేంగే నహీ చలేంగే అంటూ కాశ్మీర్ కోసం పోరాడిన మహనీయుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయనకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఒంగోలులోని సమతానగర్, మారుతీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అఖండ భారతదేశ స్ఫూర్తి, నిరాడంబరతకు నిదర్శనంగా నిలిచిన గొప్ప జననేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని, చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సూర్య కల్యాణ్ చక్రవర్తి మొక్కలు నాటి పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

మద్దిపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. ఒకటి మ్యుటేషన్ కోసం రాగా, మరొకటి లేట్ బర్త్ ఎంట్రీ కోసం వచ్చినట్లు చెప్పారు. రెండు అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు.

స్వామివార్లకు వెండి వస్తువుల బహూకరణ


నూతన రజిత గధతో అభయాంజనేయస్వామి


నూతన రజిత కిరీటాలు, ధనుర్బాణాలతో సీతారామలక్ష్మణులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు డొంక మర్రిచెట్లకాలనీ వద్ద ఉన్న పొలిమేర అభయాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ సీతారామలక్ష్మణస్వామివార్లకు లక్షా 30 వేల రూపాయల విలువైన ఎనిమిది గ్రాముల నూతన రజిత కిరీటాలు, ధనుర్బాణాలను సోమవారం దాతలు అందజేశారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి రజిత గధ సమర్పించారు. శ్రీ ఓగిరాల వెంకటేశ్వరరెడ్డి, భారతిల కుమారుడు రవికుమార్‌రెడ్డి, లోహిత దంపతులు కలిసి ఆలయ అర్చకుడు పరాంకుశం సమీర్‌కు వాటిని అందజేశారు. దేవస్థాన నిర్వాహకులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై అవగాహన కార్యక్రమం

నాగులుప్పలపాడు: మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ పాలన ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షురాలు పొద అపర్ణ అన్నారు. బీజేపీ పాలన 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రాత్రి మండలంలోని పోతవరం గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. మోదీ పాలన, పథకాలపై అవగాహన కల్పించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిది...

దేశ ఐక్యత కోసం శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదని బీజేపీ మండల అధ్యక్షురాలు అపర్ణ అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పొద వరప్రసాద్, ఎల్.టీగ్రా, రమేష్, రాయపూడి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ

ఒంగోలు టౌన్: ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని సులువుగా అరికట్టవచ్చని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ బెజవాడ శ్రీవాణి తెలిపారు. సోమవారం నగరంలోని పాపాకాలనీలో గల యూపీహెచ్‌సీలో ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా పోర్టబుల్ హ్యాండ్ పరికరం ద్వారా 80 మందికి ఎక్స్‌రేలు తీసి పరీక్షలు చేసి రోగులను గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవాణి క్షయ వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్సా విధానం గురించి రోగులకు అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంగకుమార్ యాదవ్ వైద్యశాలలో లభించే చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షల గురించి వివరించారు. డీపీసీలు ఎస్.రత్నకుమారి, ఎస్.సురేష్, సూపర్‌వైజర్లు కె.కాలేషాబాబు, ఈ జ్యోతి కుమారి, మహిత పాల్గొన్నారు.